'లక్షడప్పులు-వేయిగొంతులు' పోస్టర్లు ఆవిష్కరణ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ డిమాండ్‌తో ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న లక్షడప్పులు-వేయిగొంతులు మహా ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్లను శనివారం మీర్‌పేట్ చౌరస్తాలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌మాదిగ, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవిమాదిగ, శ్రీనివాస్‌మాదిగ, నర్సింహమాదిగ, సుధాకర్‌మాదిగ, ఎల్లయ్యమాదిగ, బాబుమాదిగ పాల్గొన్నారు.

రోగి సహాయకుడు, వైద్యుడి మధ్య వివాదం

● ఒకరిపై మరొకరు ఫిర్యాదు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని చిల్డ్రన్ సేఫ్ ఆస్పత్రిలో ఏడాది బాబుకు జ్వరం రావడంతో చికిత్స కోసం వచ్చిన పేషంట్ అటెండెంట్ డాక్టర్‌తో వివాదానికి దిగాడు. ఈ నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకొని మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు వివరాల్లోకి వెళ్తే.. మలక్‌పేట నివాసి కరీం బంధువు తన ఏడాది వయసున్న కుమారుడికి తీవ్ర జ్వరం రావడంతో మలక్‌పేట చిల్డ్రన్స్ సేఫ్ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. జ్వరం తీవ్రంగా ఉండడంతో ఐసీయూలో చేర్చాలని వైద్యులు తెలిపారు. అందుకు పేషెంట్ బంధువులు నిరాకరించి మామూలు వైద్యం చేయాలని సూచించారు. ఈ విషయంలో వైద్యుడికి పేషంట్ బంధువుల మధ్య తలెత్తిన వివాదం దాడికి దారితీసింది. ఈ మేరకు పేషంట్ బంధువైన కరీం ఆస్పత్రి సిబ్బందిపై ఫిర్యాదు చేయగా ఆస్పత్రి మేనేజర్ కరీంపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మలక్‌పేట పోలీసులు ఇరువురి ఫిర్యాదులపై వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

పేద, మధ్య తరగతికి ఊరట



లోక్‌సభలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులకు, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కొంత ఉపశమనం కలుగజేస్తుందనీ, ప్రైవేటు పెట్టుబడులకు ద్వారాలు తెరవడం దేశ ప్రయోజనాలకు దెబ్బ, తెలంగాణకు అన్యాయం జరిగిందని పలువురు తమ అభిప్రాయాలను తెలియజేశారు. - జోన్‌బృందం

ఆదాయపన్ను చెల్లింపుదారులకు తీపికబురు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదాయపన్ను చెల్లింపుదారులకు తీపికబురు అందించింది. కొత్త పన్ను విధానంలో స్టాండర్డ్ డిడక్షన్ కలుపుకొని సంవత్సరానికి రూ.12.75లక్షల ఆదాయం వచ్చేవారికి పన్ను మినహాయింపు ఇవ్వడం ఎంతో ఊరటనిచ్చింది. వృద్ధులకు వడ్డీపై టీడీఎస్‌లో సడలింపు ఇవ్వడం మంచి నిర్ణయం.

- బచ్చు మహేష్‌గుప్తా, వ్యాపారి, చంపాపేట

విద్యారంగానికి ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపు లేదు



విద్యా రంగానికి ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపులు జరగలేదు. అధికంగా నిధులు కేటాయించినట్లయితే గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలలు మరింత మెరుగు అయ్యేవి. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం సరికాదు.

- దన్నె రాజు, సీనియర్ అధ్యాపకుడు

వేతనజీవులకు భారీ ఊరట..



బడ్జెట్‌లో పింఛనుదారులకు, వేతన జీవులకు భారీ ఊరట కలిగిందనే చెప్పవచ్చు. వ్యక్తిగతంగా నెలకు లక్ష సంపాదన పొందుతున్న వారికి పన్ను లేకపోవడం సంతోషకరమైన విషయం. సంపాదనలో కొంతమేర పొదుపు చేసుకునే అవకాశం కలిగిందనే చెప్పవచ్చు.

- నందిరాజు లక్ష్మీనారాయణ, రిటైర్డ్ పోస్టల్ సూపరింటెండెంట్

దూరదృష్టితో కేంద్ర బడ్జెట్



'హీల్ఇన్ ఇండియా' కార్యక్రమం ద్వారా గ్లోబల్ మెడికల్ టూరిజంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపారు. దూరదృష్టితో ఉన్న కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం, అభినందిస్తున్నాం. ప్రైవేట్ సెక్టార్‌తో సహకార ప్రయత్నం వల్ల ఆర్థిక వ్యవస్థను పెంచడంతో పాటు రోగులకు ప్రపంచస్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుంది. కెపాసిటీ బిల్డింగ్, స్ట్రీమ్‌లైన్డ్ వీసా నిబంధనలు, ప్రయాణ సౌలభ్యంపై వ్యూహాత్మక ప్రాధాన్యత, వైద్య పర్యాటకం సామర్థ్యాన్ని సులభతరం చేస్తుంది.

-డాక్టర్ గాయత్రి కామినేని, సీఓఓ కామినేని ఆస్పత్రి

ఆరోగ్య సంరక్షణకు కేటాయింపులు



కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. మెట్రో ప్రాంతాల్లో వచ్చే అయిదేళ్లలో 75వేల మెడికల్ సీట్లను పెంచడం వల్ల వైద్య విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. దీంతో దేశం విడిచి ఇతర దేశాలకు వెళ్లే వారి సంఖ్య తగ్గుతుంది. జిల్లాల వారీగా కేన్సర్ సెంటర్లు ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణవాసులకు ఆరోగ్య సంరక్షణ అందుతుంది. కేన్సర్ మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వల్ల రోగులకు మేలు చేస్తుంది.

- డాక్టర్ సి. మల్లికార్జున, మేనేజింగ్ డైరెక్టర్, ఏఐఎన్‌యూ

కేసుల ఛేదనలో అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● ఐటీసెల్, ఎస్‌వోటీ కార్యాలయాలను సందర్శించిన సీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణ, కేసుల ఛేదనలో పోలీసులు అత్యాధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్బీనగర్‌లో ఉన్న ఐటీసెల్, ఎస్‌వోటీ కార్యాలయాలతో పాటు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ రాచకొండ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పలు కేసుల దర్యాప్తులో సాంకేతిక ఆధారాలను అందించడంతో పాటు, పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్, 100 డయల్ వంటి అత్యవసర సేవల విభాగాల్లో ఐటీ సెల్ పోషిస్తున్న పాత్రను అభినందించారు. ఐటీ సెల్ కార్యాలయంలోని సోషల్ మీడియా ఇతర విభాగాల సిబ్బంది పనితీరును సమీక్షించారు. సీసీటీవీల వినియోగాన్ని ప్రజల్లో మరింత బలంగా ప్రచారం చేయాలని, వాటి నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల వద్దకు పోలీసులు సాధ్యమైనంత తక్కువ సమయంలో చేసుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, నూతన విధానాలను రూపొందించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఓటీ కార్యాలయాన్ని సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. రాచకొండ పరిధిలో డ్రగ్స్ సరఫరా చేసే ముఠాలను, అంతర్రాష్ట్ర సైబర్ క్రైమ్ ముఠాలను ఉక్కుపాదంతో నిర్మూలించాలని సూచించారు. అనంతరం ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓటీ అదనపు డీసీపీ షాకీర్ హుస్సేన్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్‌గౌడ్, ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఐటీ సెల్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

కేంద్ర బడ్జెట్‌పై బీజేపీ సంబరాలు

● ప్రధాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఎల్‌బీనగర్ : కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం జనరంజకమైన బడ్జెట్ ప్రవేశపెట్టిందని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం సరూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద బీజేపీ సరూర్‌నగర్ అధ్యక్షుడు మిట్టపల్లి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. 12లక్షల వరకు వేతన జీవులకు పన్ను మినహాయించి భారీ ఊరటనిచ్చారన్నారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు కాటంరాజు, కబీర్‌దాస్, నందకుమార్, ఎంఎన్‌రావు, శ్రీశైలంగౌడ్, దిలీప్, వెంకటేష్ రజక, కిషోర్, పులి, కోటి, స్టీవెన్, అఖిల్, రజిని పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి

● ఏసీపీ మహ్మద్‌గౌస్

సంతోష్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ మహ్మద్‌గౌస్ సూచించారు. ఐఎస్‌సదన్ వినయ్‌నగర్ కాలనీలోని శాన్వి కళాశాలలో విద్యార్థులకు శనివారం సైబర్‌క్రైమ్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యాధునిక సైబర్ నేరాలైన కొరియర్‌మోసం, నకిలీ ఆన్‌లైన్ గిఫ్ట్ ఆఫర్, ఆన్‌లైన్ ఫేక్ అడ్వర్‌టైజ్‌మెంట్స్ తదితర అంశాలపై ప్రస్తావించారు. సైబర్ నేరాలపై నాటకాలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సైదాబాద్ అదనపు ఇన్‌స్పెక్టర్ ఆనంద్‌కుమార్, ఎస్‌ఐలు రుమాన, బ్రహ్మాచారి, వైస్ ప్రిన్సిపాల్ జాయిస్ పాల్గొన్నారు.

విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

వనస్థలిపురం, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేయాలని అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం కోరారు. శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మల అభ్యున్నతికై విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, యాభై ఏళ్లు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని, తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయించడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎమ్మెల్సీని కోరారు. కార్యక్రమంలో విశ్వకర్మ మహాసభ కోశాధికారి అవంచ మురళీచారి, ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాసచారి, లక్ష్మణాచారి, లక్ష్మీనారాయణ, జయశ్రీ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం

రాష్ట్రపతిపై అనుచిత వ్యాఖ్యలపై ఆందోళన

● కాంగ్రెస్‌కు బీజేపీ నేతల హెచ్చరిక



బడంగ్‌పేట్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

సరూర్‌నగర్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): గిరిజన సామాజిక వర్గానికి చెందిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారి నాలుకలు చీరేస్తామని బీజేపీ నేతలు హెచ్చరించారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగం అనంతరం కాంగ్రెస్ నేతలు ఆమెపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శనివారం బీజేపీ బడంగ్‌పేట్ క్లస్టర్-12 అధ్యక్షులు ఆర్.రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియా చిత్రపటాన్ని దహనం చేసి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, నడికుడ యాదగిరి, సామ సంజీవరెడ్డి తదితరులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత మూడు పర్యాయాలుగా రాజకీయాలతో సంబంధం లేని ప్రముఖులకు రాష్ట్రపతి పదవి కట్టబెడుతున్నదని, దీనిని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆరోపించారు. అత్యున్నత పదవుల్లో ఉన్నవారి గౌరవానికి భంగం వాటిల్లేలా అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మునిసిపల్, మండల నాయకులు గుర్రం మల్లారెడ్డి, ఏనుగు రాంరెడ్డి, పో రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల శ్రీకాంత్‌గౌడ్, కొంతం ప్రకాశ్‌రెడ్డి, చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, వేణుగౌడ్, కళ్లెం లక్ష్మారెడ్డి, జగదీశ్వర్‌రాజు, రేసు నర్సింహారెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి, కుంటె భాస్కర్, సందీప్, సాయిసంతోష్, మహేందర్, గోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులకు ఐడీబీఐ సహకారం అభినందనీయం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులకు సహకరించేందుకు ఐడీబీఐ బ్యాంకు వారు ముందుకు రావడం అభినందనీయమని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ ఇనిషియేటివ్ కార్యక్రమాల్లో భాగంగా ఐడీబీఐ బ్యాంక్ ఎల్బీనగర్ బ్రాంచి ఆధ్వర్యంలో బండ్లగూడ రోడ్డులోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో శనివారం జడ్‌పీహెచ్ఎస్, ఎంపీపీ పాఠశాలలకు, బీసీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలకు రూ.1.75లక్షల విలువ చేసే మూడు కంప్యూటర్లు, ప్రింటర్లను వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి.శ్యామసుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ఐడీబీఐ ఎల్బీనగర్ బ్రాంచి హెడ్ తనూ షైకేల్, రీజినల్ మేనేజర్ హరికృష్ణ, అసెట్ ఆఫీసర్ మాధవిలతో కలిసి విద్యార్థుల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వాటిని అందజేశారు. బీసీ కాలనీ ఎంపీపీ పాఠశాల హెచ్ఎం కవితారెడ్డి, జడ్‌పీహెచ్ఎస్ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఎన్.రామలింగం, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



హెచ్ఎంలకు కంప్యూటర్లు అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

చాదర్‌ఘాట్/ఓల్డ్‌మలక్‌పేట : సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కలిగిఉండాలని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు అన్నారు. శనివారం ఓల్డ్ మలక్‌పేట పోచమ్మ ఆలయం వద్ద చాదర్‌ఘాట్ పోలీసులు, సైబర్ క్రైమ్ టీమ్‌తో కలిసి ఆయన అవగాహన కల్పించారు. సైబర్ మోసాల్లో చిక్కుకున్న బాధితులు వెంటనే 1930కు సమాచారం ఇచ్చి అందుకు కారకులను గుర్తించడంలో పోలీసులకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.